

నిరుద్యోగులకు నయవంచన

ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ హామీ

- గడిచిన ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ఏడాది ముందు కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఇప్పటికీ కొలిక్కిరాని కానిస్టేబుల్ పోస్టుల భర్తీ వ్యవహారం
- ఇటీవల హడావిడిగా డీఎస్సీ నోటిఫికేషన్
- కోర్టు అభ్యంతరాలతో వాయిదాపడిన నిర్వహణ
- ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామంటున్న నిరుద్యోగులు



విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

'ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేస్తాం. నిరుద్యోగులకు అండగా ఉంటాం. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 26 వేలకుపైగా పోస్టులను అధికారంలోకి వచ్చిన వెంటనే భర్తీచేస్తాం'

- ఇదీ ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ.





అధికారంలోకి వచ్చి ఐదేళ్ల గడిచిపోయింది. కానీ, జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీచేయలేదు. పోలీస్ శాఖలోనూ వందలాది ఖాళీలు ఉన్నాయి. ఎన్నికలకు ఏడాది ముందు నోటిఫికేషన్ ఇచ్చినా రిక్రూట్‌మెంట్ ప్రక్రియను నెలల తరబడి సాగదీసింది. ఇప్పటికీ కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తికాకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు నిరాశానిస్పృహల్లో ఉన్నారు. ఇక ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే సుమారు ఐదు లక్షల మంది వరకు అభ్యర్థులు ఉన్నారు. వీరంతా గడిచిన ఐదేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నారు. మంత్రులు ఇదిగో...అదిగో అంటూ ప్రకటనలతో కాలం వెళ్లదీశారే తప్ప...ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదు. మెగా డీఎస్సీ విడుదల చేస్తామంటూ అనేకసార్లు విద్యా శాఖా మంత్రి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. కానీ, నామమాత్రపు పోస్టులతో ఎన్నికలకు కొద్దిరోజులు ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. టెట్, డీఎస్సీకి తక్కువ సమయం ఇవ్వడం, సిలబస్ ఎక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో టెట్‌కు డీఎస్సీకి తగిన వ్యవధి ఉండేలా చూడాలని ఆదేశించింది. ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన ఏకైక డీఎస్సీ నోటిఫికేషన్ కూడా నిలిచిపోయినట్టు అయింది. ఇక ఉన్నత పాఠశాలల్లో సమీపంలో గల (మూడు కిలోమీటర్ల పరిధి) ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ పోస్టులు కూడా బాగా తగ్గిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క ఉపాధ్యాయ, పోలీస్ పోస్టును భర్తీచేయకుండా ఐదేళ్లు పూర్తిచేసిన ఏకైక ప్రభుత్వంగా..జగన్ సర్కారు నిలిచిపోతుందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

లక్షల్లో నిరుద్యోగులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నారు. దాదాపు ... మిగతా 6వ పేజీలో

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం



- ఎస్.ఆనంద్

వైసీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. గడిచిన ఆరేళ్లుగా కానిస్టేబుల్ పోస్టు కోసం సిద్ధమవుతున్నా. ఎన్నికలకు ఏడాది ముందు నోటిఫికేషన్ ఇచ్చిన ఈ ప్రభుత్వం ఇప్పటికీ నియామక ప్రక్రియను పూర్తి చేయలేకపోయింది. ప్రిలిమినరీ పరీక్షల తరువాత తదుపరి దశ కోసం వేలాది మంది నిరీక్షిస్తున్నారు. ఈ శిక్షణ కోసం ఈ ఆరేళ్లలో సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా ఖర్చయ్యింది. ఉద్యోగం వస్తే ఆనందంగా ఇంటికి వెళ్లాలని భావించాను. కానీ నియామక ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోవడంతో ముఖం చెల్లడం లేదు. ఎంతో ఆశ పెట్టుకున్న తల్లిదండ్రులకు ఏం చెప్పాలో తెలియడం లేదు. ఆరేళ్ల సమయం, లక్షలాది రూపాయల డబ్బు ఖర్చు తప్పితే ఫలితం లేకుండా పోయింది.

నట్టేటముంచేశారు



- కేజే రావు

నిరుద్యోగులను ఈ ప్రభుత్వం నట్టేట ముంచింది. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్...మమ్మల్ని మోసం చేశారు. ఈ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. ప్రతిపక్షంలో ఉండగా విద్యాశాఖలో సుమారు 26 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన ఆయన...అధికారం చేపట్టిన తరువాత ఆ పోస్టుల ఊసే ఎత్తలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారనే ఆశతో అవనిగడ్డలో శిక్షణ పొందాను. సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చయింది. తల్లిదండ్రులకు అప్పులు తప్ప మరేమీ మిగలలేదు. ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా...సిలబస్ ఎక్కువ, సమయం తక్కువ ఉండే విధంగా చేసి ఇబ్బంది పెట్టాలని చూశారు. కోర్టుకు వెళ్లి డీఎస్సీ నిలుపు చేయడం వల్ల మాకు మేలు జరిగింది.

ఘోరం

పెందుర్తి సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- మృతుల్లో తండ్రి, కొడుకు
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా విషాదం

పెందుర్తి, ఏప్రిల్ 4:

పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



ప్రమాదానికి గురైన మినీ వ్యాన్



హనుమంతు ఆనందరావు(ఫైల్)



హనుమంతు చంద్రశేఖర్(ఫైల్)



చింతాడ ఇందుమతి(ఫైల్)

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, సిపాని వెంకటలక్ష్మి, నాగమణి, తమ్మినేని నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (15) చింతాడ ఇందుమతి (65) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ... మిగతా 6వ పేజీలో

సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులకు

ఇంకా అందని పాఠ్యపుస్తకాలు!

బోధన కోసం ఉపాధ్యాయులకు పీడీఎఫ్‌లు

- విద్యార్థుల వద్ద పుస్తకాలు లేకుంటే ఎలా...
- ట్యాబ్‌లలో కూడా ఓపెన్ కాని వైనం
- మరోవైపు మూల్యాంకనం విధుల్లో టీచర్లు
- విద్యార్థులతో విద్యా శాఖ ఆటలు



విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్ అమలు వ్యవహారంలో తొలి నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీరు గందరగోళంగానే ఉంది. ప్రస్తుతం పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలు ఇంకా అందలేదు. ప్రస్తుతం బోధన కోసం టీచర్లకు పీడీఎఫ్ ఫార్మెట్‌లో పాఠ్యపుస్తకాలు ఇవ్వడంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు.

రెండేళ్ల క్రితం అంటే 2022-23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలు/కేజీబీవీలు/రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలు చేశారు. విశాఖ జిల్లాలో 19 ఉన్నత పాఠశాలలు/కేజీబీవీలు/రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో పాఠాలు బోధిస్తున్నారు. దీనికి అనుగుణంగా సీబీఎస్ఈ సిలబస్‌తో పాఠశాల విద్యా శాఖ పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందజేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం తెలుగు, ఆంగ్ల భాషలో పాఠ్యపుస్తకాలు ముద్రిస్తున్నారు. అంటే పుస్తకంలో ఎడమ వైపు తెలుగు, కుడివైపు ఆంగ్ల భాషలో సిలబస్ ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌లో చదివిన విద్యార్థులకు సీబీఎస్ఈ రూపొందించే ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం ఎనిమిదో తరగతి చదివిన విద్యార్థులంతా మార్చిలో తొమ్మిదో తరగతి పరీక్షలు రాసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరంలో పదో తరగతిలోకి ప్రవేశించారు. రాష్ట్రంలో జూన్ నుంచి ఏప్రిల్ వరకు విద్యా సంవత్సరంగా పరిగణిస్తుండగా, సీబీఎస్ సిలబస్‌లో మాత్రం విద్యా సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీన ప్రారంభమవుతుంది. దీనికి అనుగుణంగా జిలాల్లో 19 పాఠశాలల్లో తొమ్మిదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఈ నెల ఒకటో తేదీ నుంచి పదో తరగతికి ప్రమోట్ అయ్యారు. వీరికి పదో తరగతి సీబీఎస్ఈ సిలబస్‌లోనే మాత్రమే బోధన చేయాలి. విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు ముద్రణ చేసి పాఠశాలలకు సరఫరా చేయాలి. కానీ పాఠ్యపుస్తకాలు రూపొందించారు కానీ ముద్రణ పూర్తికాలేదు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభం కావడంతో విద్యాశాఖ హడావిడిగా పాఠ్యపుస్తకాల పీడీఎఫ్‌లను ... మిగతా 6వ పేజీలో

నకిలీ సిగరెట్ల కేసులో చేతివాటం

- ఈనెల ఒకటో తేదీన మింది వద్ద భారీగా స్వాధీనం
- గాజువాక పోలీసులకు అప్పగించిన స్పెషల్ స్క్వాడ్
- రూ.30 లక్షలు విలువైనవిగా లెక్కగట్టిన జీఎస్టీ అధికారులు
- రూ.8 లక్షలు మాత్రమేనంటున్న పోలీసులు
- ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే వాస్తవాలు వెలుగులోకి..

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్నాయి. అందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీన మింది వద్ద ప్రత్యేక స్క్వాడ్ ఒక కారులో సిగరెట్లను గుర్తించింది. వాటికి సంబంధించిన పత్రాలను అడగ్గా కారులోని వ్యక్తులు చూపించలేదు. నగరంలో గల ఐదుగురు ఐటీసీ డీలర్లను తనిఖీ అధికారులు సంప్రదించగా తమకు సంబంధం లేదని చెప్పారు. సాధారణంగా ఐటీసీ నుంచి సిగరెట్లను కొనుగోలు చేసినట్టయితే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ చెల్లించినట్టు పత్రాలు లేకపోవడంతో నకిలీ సిగరెట్లుగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. జీఎస్టీ అధికారులకు కూడా దీనిపై సమాచారం ఇచ్చి నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయాలని కారుతోపాటు సిగరెట్లను గాజువాక పోలీసులకు అప్పగించారు. అయితే మొత్తం సరకు విలువ రూ.30 లక్షలు ఉంటుందని ... మిగతా 6వ పేజీలో

అప్పుల ఊబిలో విశాఖ ఉక్కు

- మార్చి నెలాఖరుకు ముడి పదార్థాల బకాయి రూ.4,380 కోట్లు
- ఇతర విడి పరికరాలు, సరఫరా చేసిన వారికి చెల్లించాల్సిన మొత్తం రూ.1,435 కోట్లు

- మెయిన్‌లో

చోడవరంలో ఉద్రిక్తత

- టైల్స్ దుకాణంపై స్టేట్ జీఎస్టీ అధికారులు దాడులు
- ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీయే చేయించారని యజమాని ఆరోపణ
- దాడులను నిరసిస్తూ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆందోళన
- నోటీసులు ఇవ్వకుండా సోదాలు ఏమిటంటూ నిలదీత
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామంటూ హెచ్చరిక
- వెనుతిరిగిన అధికారులు



టైల్స్ దుకాణంలో జీఎస్టీ అధికారుల తీరును నిలదీస్తున్న సీఎం రమేష్, పక్కన మాజీ ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 4: అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలోని గాంధీగ్రామంలో బుచ్చిబాబు అనే వ్యాపారికి చెందిన టైల్స్ దుకాణంపై స్టేట్ జీఎస్టీ అధికారులు గురువారం దాడులకు దిగడం వివాదాస్పదమైంది. తనపై కక్షతో అధికారులను వైసీపీ అభ్యర్థి, శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ దాడులకు ఉసిగొల్పారని ఆరోపిస్తూ టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు, ఆయన కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలిసి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజులు టైల్స్ దుకాణం వద్దకు చేరుకున్నారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో దాడులకు పాల్పడడం ఏమిటంటూ సీఎం రమేష్ ప్రశ్నించారు. ఒకపక్క ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, వైసీపీ నేతలకు మద్దతుగా నిలవని వారిపై ఈ విధంగా దాడులకు దిగడం ఏమిటంటా నిలదీశారు. అసలు తనిఖీలకు సంబంధించి నోటీసులు ఇవ్వకుండా, భయభ్రాంతులకు గురిచేయడం, రికార్డులు సీజ్ చేయడానికి యత్నించడమేమిటంటూ ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. సీఎం రమేష్ ప్రశ్నలకు జీఎస్టీ అధికారులు నీళ్లు నమలడంతో పాటు సరైన సమాధానం ఇవ్వలేక అక్కడ నుంచి నిష్క్రమించారు. అధికారుల దాడికి నిరసనగా టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో, స్థానిక పోలీసులు దుకాణం వద్దకు చేరుకున్నారు.

ఉదయం నుంచి దాడులు

కాగా బుచ్చిబాబు టైల్స్ దుకాణంలో గురువారం ఉదయం నుంచి జీఎస్టీ అధికారులు గోప్యంగా సోదాలు నిర్వహించారు. నలుగురు అధికారులతో కూడిన బృందం...బుచ్చిబాబు దుకాణంలోని సీసీ కెమెరాలు ఆపివేయించి, సిబ్బంది నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రికార్డులు తనిఖీ చేయడం విశేషం.

వైసీపీ నేతల అక్రమాలకు ఈ దాడులు పరాకాష్ట: సీఎం రమేశ్

అధికారులను పావుగా ఉపయోగించుకుని వ్యాపారులను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించడం సిగ్గుచేటని ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.15
సహరి (శని)	4.32



25వ వార్డులో ప్రచారం చేస్తున్న వైసీపీ మాజీ కార్పొరేటర్ జీవీ రమణి

పెన్షన్లపై వైసీపీ దుష్ప్రచారం


- ఇంటింటికీ వెళుతున్న నేతలు
- తెలుగుదేశం పార్టీపై అభాండాలు
- జగన్ మళ్లీ సీఎం కాకపోతే వలంటీర్లు ఉండరంటూ ప్రచారం
- వారు వైసీపీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారనే కదా... ఎన్నికల సంఘం ఆపేసిందని ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా జారుకుంటున్న వైనం

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నాయకులు బరితెగించేశారు. ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశంపైకి నెట్టేస్తున్నారు. ఇప్పుడు ఇంటింటికీ పనిగట్టుకొని తిరుగుతూ పెన్షన్లపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇళ్లల్లో ఉన్న వృద్ధులను బయటకు పిలిచి, 'మీకు పెన్షన్ అందిందా? ఇంకా ఇవ్వలేదు కదా?, వలంటీరు రాలేదు కదా! మీకు సచివాలయానికి రమ్మంటున్నారా?'...అంటూ పలకరిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఇంటికి వచ్చి సేవ చేస్తున్న వలంటీర్లను ఇప్పుడు రాకుండా చేసింది చంద్రబాబేనని చెబుతున్నారు. ఆయన కేసు వేయడం వల్లే మరో మూడు నెలలు వలంటీర్లు ఇళ్లకు రారని, సేవలు చేయరని చిలవలు పలవలు చేసి వివరిస్తున్నారు. మళ్లీ జగన్ వస్తేనే వలంటీర్ల సేవలు కొనసాగుతాయని, లేదంటే పెన్షన్లు బయటకు వెళ్లి తీసుకోవలసి ఉంటుందని భయపెడుతున్నారు. నగరంలో వివిధ నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్న వైసీపీ అభ్యర్థులు ఈ రకమైన ప్రచారం చేయాలని మహిళా నాయకులకు పురమాయించారు. ఆ మాటలన్నీ వీడియో తీసి ... మిగతా 6వ పేజీలో

డీసీపీ మణికంఠ చందోలు బదిలీ

- చిత్తూరు జిల్లా ఎస్పీగా నియామకం



మణికంఠ చందోలు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-1గా పనిచేస్తున్న మణికంఠ చందోలు చిత్తూరు జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది జనవరి 31న ఆయన నగర డీసీపీ-1గా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆరోపణల కారణంగా చిత్తూరు జిల్లా ఎస్పీ జాషువాను బదిలీ చేయాల్సిందిగా ఎన్నికల సంఘం రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో మణికంఠను నియమించింది.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం: జేసీ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 4: నామినేషన్ల ప్రక్రియ, బ్యాలెట్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తూర్పు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్నిఅంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్కోర్ ద్వారా అనుమతులు జారీ ప్రక్రియ, శిక్షణ సదస్సులు, పరిశీలన ప్రక్రియ తదితర అంశాలను తెలుసుకోవాలన్నారు. సంబంధిత సామగ్రి, సాంకేతిక పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల కూడలి

- సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదుట ట్రాఫిక్ నియంత్రణ శూన్యం
- ఇష్టారీతిగా వాహనాల రాకపోకలు.. చోదకులకు అవస్థలు



కూడలిలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



వృథాగా రోడ్డు పక్కన పడేసిన ట్రాఫిక్ ఐల్యాండ్

సీతమ్మధార, ఏప్రిల్ 4: నగరంలోని ప్రధాన మార్గాల్లో ఒకటైన సీతమ్మధార మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో నిత్యం కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నగరంలోని ఎటు వెళ్లాలన్నా ఇది ఉపయోగకరం. అటువంటి రహదారిలో యూనియన్ బ్యాంక్‌కి సమీపంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గల జంక్షన్‌లో ట్రాఫిక్ ప్రమాదభరితంగా మారింది. అక్కడ ఎటువంటి సిగ్నల్ పాయింట్లు లేకపోవడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎవరు ఉండరు. ఈ రోడ్డులో రోజూ ఏదో ఒక పార్టీకి చెందిన రాజకీయనాయకులు, లేదా జీవీఎంసీఅధికారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ, ట్రాఫిక్ సరిదిద్దే చర్యలు తీసుకోవడంలేదు ఈ కూడలిలో గతంలో ట్రాఫిక్ ఐల్యాండ్ గతంలో ఉండేది. అక్కడ ట్రాఫిక్ పోలీసులను నియమించాలని అధికారులు నిర్ణయించారు. అయితే, ఆ ట్రాఫిక్ ఐల్యాండ్‌ను అక్కడి నుంచి తొలగించి రోడ్డు పక్కన పడేశారు. అది ఇప్పుడు దేనికీ పనికిరాకుండా దర్శనమిస్తోంది. సీతమ్మధారకూడలి నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లడానికి, సత్యం కూడలి నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలికి వెళ్లేందుకు మధ్యలోనున్న ఈ జంక్షన్‌నుంచి ఇటునక్కవానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, కేఆర్ఎం కాలనీ తదితర ప్రాంతల నుంచి వచ్చే ప్రజలకు ఇదే దారి. అదే విధంగా గురుద్వారా నుంచి సీతమ్మధార, మద్దిలపాలెం తదితర ప్రాంతాలకు వచ్చేందుకు ఈ కూడలి ప్రధానమైనది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ లేక వాహనాలు రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ అంతరాయం నెలకొంటోంది. కూడలిలో కొంతమంది రాంగ్ రూట్ నుంచి వస్తుండటంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు రోడ్డు దాటడానికి కష్టతరంగా మారుతోంది. గతంలో కన్నా రహదారి విస్తరించినా సిగ్నల్ పాయింట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ జంక్షన్ వద్ద పోలీసులు తరచూ వాహనాలు తనిఖీ చేస్తుంటారు. ఇంత ప్రాధాన్యం గల ఈ జంక్షన్‌లో ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేలా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మురళీనగర్‌లోని పోస్టాఫీస్ తరలించొద్దు..!

మురళీనగర్, ఏప్రిల్ 4 ; మురళీనగర్‌లోని పోస్టాఫీస్‌ను తరలించే ప్రయత్నాలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దాదాపు 30 ఏళ్ల కిందట పోస్టల్ వినియోగదారులకు సేవింగ్ అకౌంట్స్ , పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ ప్లాన్‌లతో సమీప మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ వాసులకు అందుబాటులో ఇక్కడ పోస్టాఫీసు ఏర్పాటుచేశారు. గురువారం ఒక్కసారిగా ఇక్కడి పోస్టల్ శాఖ ఖాళీ చేసి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పోస్టల్ కార్యాలయానికి తరలిస్తున్నట్టు అధికారులు తెలియజేయడంతో మురళీనగర్ వాసులు అసంతృప్తికి గురయ్యారు. వెంటనే మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోస్టల్ శాఖ జిల్లా అధికారులకు తమ వినతి పత్రమిచారు. స్థానికుల కోరిక మేరకు ఈ శాఖను ఇక్కడే కొనసాగించాలని కోరారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం?

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : వృద్ధురాలిపై ఇద్దరు ఆకతాయిలు లైంగిక వేధింపులు, అత్యాచారయత్నం చేసినట్టు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు అందినట్టు తెలిసింది. జాలారిపేటకు చెందిన వృద్ధురాలిపై మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు వేధింపులకు పాల్పడినట్టు సమాచారం. పూర్తి వివరా లు సేకరించాల్సి ఉందని పోలీసులు చెపుతున్నారు.

విశాఖ వాసులు విధ్వంసాన్ని కాదు... అభివృద్ధి ఆశిస్తున్నారు

- టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



31వ వార్డులో ప్రచారం చేస్తున్న శ్రీభరత్, వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 4: విశాఖ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలను కాదని టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి ఎం. శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులో గురువారం సాయంత్రం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణయాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను రాజధానిగా చేస్తామని ఇక్కడి ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు పొందారని వైసీపీ ప్రభుత్వాన్నిఉద్దేశించి విమర్శించారు. కనీసం రైల్వే డివిజన్‌కు స్థలం కేటాయించలేకపోయారని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని ఈసందర్భంగా అన్నారు. వంశీకృష్ణయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలను ప్రతిపక్ష పార్టీలకు ఆపాదించి వైసీపీ ప్రభుత్వం రాక్షస రాజకీయాలకు తెరతీసిందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ మాట్లాడుతూ శ్రీభరత్ వంటి సమర్థులను విశాఖ తరఫున పార్లమెంట్‌కు పంపాలని కోరారు. వంశీ కృష్ణ విజయంకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీసాగిస్తున్న దుష్టపాలనకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ పిలుపునిచ్చారు. వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిఇంటికి వెళ్లి వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేందుకు కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఏప్రిల్ 4: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార అభయ ఆంజనేయస్వామి ఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ డౌన్, ఆర్ అండ్‌బీ క్వార్టర్స్ సబ్బంహరి గృహం ఉన్నప్రాంతం, టీపీటీ కాలనీ, ఎన్‌బీఎంలా కాలేజీ, పీఅండ్‌టీ కాలనీ, గాంధీనగర్, పోస్టాఫీస్ ప్రాంతం, ఎఎస్ఆర్ నగర్, రాకెట్ పార్క్ ప్రాంతం, హిల్‌వ్యూ పార్కు, తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్కయ్యపాలెం ప్రాంతంలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ వర్గాలు తెలిపాయి. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, అబిద్‌నగర్ ప్రాంతాల్లో వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా ఆళ్వారుల, శ్రీ రామానుజు విగ్రహాల ఆవిష్కరణ



అభిభాషణ చేస్తున్న చిన జీయర్ స్వామి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 4: జీవీఎంసీ 87వ వార్డు రాజులపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గురువారం ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి సుప్రభాతం, విశేష ద్వార తోరణ పూజ, నిత్య హోమాలు, ధ్వజ స్తంభానికి కుంభ పూజ, విష్ణు సహస్ర నామ పారాయణం తదితర వాటిని నిర్వహించారు. అనంతరం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆళ్వారు, శ్రీ రామానుజు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పల్గొన్నారు.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల ఐసీయూ పునఃప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఏప్రిల్ 4: కేజీహెచ్‌లో ఆధునికీకరించిన చిన్న పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను గురువారం పునఃప్రారంభించారు. ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో రూ. 80 లక్షల నిధులతో పీ ఐసీయూలో పూర్తిస్థాయిలో వెంటిలేటర్లు, ఏసీ, ఆధునాతన పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఈసందర్భంగా తెలిపారు. అలాగే, కార్డియాలజీ విభాగంలో రూ. 25 లక్షలతో చేపడుతున్న పనులు, రూ. 15 లక్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం వారధి తదితర నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపాల్, వైద్యులు అధికారులు పాల్గొన్నారు. చిన్న పిల్లల యూనిట్ ఆధునికీకరణ పనులు పూర్తవడంతో ఎన్నికల నిబంధనలకు లోబడి ఈకార్యక్రమం చేపట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

అప్పులు తీర్చలేదని యువకుడి నిర్బంధం

- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, ఐరన్ ఊచలు

మర్రిపాలెం, ఏప్రిల్ 4: బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువకుడిని తమ అప్పులు తీర్చాలని కొంతమంది నిర్బంధించి, హింసించిన ఘటన ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జీలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలివి.. మాధవధార ఉడాలే అవుట్‌లో నివాసముంటున్నా సనపల రాఘవ బెట్టింగ్‌లో అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో నష్టపోవడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులవాళ్ల బాధపడలేక ఇంటినుంచి వచ్చి ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జీలో ఆరు నెలలు ఉన్నాడు. ఈ సమయంలో లాడ్జీ నిర్వాహకుడు బలగ సంతోష్ వద్ద రూ. 5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సంతోష్ ద్వారా పరిచయమైన సుజాత నగర్‌కి చెందిన ఆదర్శ్‌రెడ్డిని అప్పుగా అడగడంతో... ఆయన దున్న వివేక్ అనే వ్యక్తి వద్దనుంచి రూ.11లక్షలు తీసుకుని రాఘవకు ఇచ్చాడు. వీరు నిత్యం డబ్బుల కోసం ఒత్తిడి తేవడంతో కొద్దిరోజుల కిందట లాడ్జీ నుంచి వెళ్లిపోయాడు. దీంతో రాఘవకు ఫోన్ చేసి లాడ్జీకి రప్పించారు. వీరితోపాటు పిళ్లా శ్రీనివాసరావు సహకారంతో ఎలాగైనా రాఘవవద్ద నుంచి డబ్బులు వసూలు చేసేందుకు నిర్బంధించారు. భయపెట్ట డంతోపాటు హింసించారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు లాడ్జీలో నిర్బంధంలో ఉన్న రాఘవను, నిందితులను అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసు లకు అప్ప గించారు. వీరివద్ద నుంచి ఐరన్‌రాడ్లు, 3 బటన్ కత్తులు, సాధారణ కత్తి ఒకటి, ఒక సర్జికల్ కత్తి, 8 కొత్త సెల్‌ఫోన్లు, 4 పాత సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సంతోష్, ఆదర్శ్‌రెడ్డి, శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. రాఘవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై 367, 307 సెక్షన్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెస్ట్‌హౌసుల లీజుతో భద్రతకు ముప్పు

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు గంగవరం, స్టీల్ గెస్ట్‌హౌస్‌లను దీర్ఘకాలిక లీజుకు ఇచ్చి దేశ భద్రతకు, కార్మిక కుటుంబాల రక్షణకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్ ఆరోపించారు. గంగవరం పోర్టును ప్రైవేటుకు ఇచ్చినపుడే తూర్పు నౌకాదళం భద్రత రీత్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని, అయినా లెక్క చేయకుండా ఇచ్చేశారని విమర్శించారు. ఇప్పుడు అక్కడి గెస్ట్‌హౌస్‌ని లీజుకు ఇస్తే.. శత్రువులు అందులో కూర్చొని నగరాన్ని ఎలా నాశనం చేయవచ్చనో ప్రణాళికలు వేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. గతంలో ఉక్కు క్లబ్‌ని ప్రైవేటుకు ఇస్తే పేకాట ఆడారని, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఉక్కు ఉద్యోగుల రిఫరెన్స్ లేదని అక్కడి గదులను బయట వారికి ఇవ్వరని, ఉక్కు టౌన్‌షిప్‌లో అది ఉండటమే దానికి కారణమన్నారు. ఇవన్నీ పక్కన పెట్టి ఇప్పుడు ఎవరికో లీజుకు ఇచ్చేస్తే ఉక్కు కుటుంబాల భద్రతకు దిక్కు ఎవరని ప్రశ్నించారు. ఉక్కు ఉత్పత్తి, విక్రయాలు పెంచడంపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం కేవలం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల ఆదాయం వచ్చే వీటిపై పని చేయడం, అది కూడా విశాఖ రక్షణకు భంగం కలిగేలా నిర్ణయం తీసుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ఈ నోటిఫికేషన్‌ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

నూకాంబిక ఉత్సవాల్లో శ్రీభరత్



పూజల్లో పాల్గొన్న శ్రీభరత్, గండి బాబ్జీ

కంచరపాలెం, ఏప్రిల్ 4 : కంచరపాలెం పరిధి జైభారత్ నగర్‌లో కొలువైన నూకాంబిక ఉత్సవాల్లో టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ గురువారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని భరత్ ప్రారంభించారు. ఆధ్యాత్మికత భావనతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని అన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

92శాతం పింఛన్ల పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లు 92శాతం పంపిణీ పూర్తి చేసినట్టు కలెక్టర్ డాక్టరు ఎ. మల్లికార్జున తెలిపారు. పింఛన్ల పంపిణీ రెండో రోజు గురువారం సాయంత్రానికి 1,65,432కిగాను 1,51,557 మంది అందజేశామన్నారు. పలు కారణాలతో ఇళ్లకే పరిమితమైన 8,674 మందికి, దూర ప్రాంతాల్లో ఉన్న 8964 మందికి ఆయా చోట్లకు వెళ్లి పింఛన్లు అందించినట్టు వివరించారు. ఈనెల ఆరోతేదీ వరకు పింఛన్లు పంపిణీ కొనసాగుందన్నారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో ప్రథ మస్థానంలో నిలిచామన్నారు.

నిరుద్యోగులకు నయవంచన

... 5వ పేజీ తరువాయి

80 శాతం మంది పోలీస్, ఉపాధ్యాయ పోస్టుల కోసం శిక్షణ పొందుతున్నారు. వీరంతా విశాఖతోపాటు కాకినాడ, అవనిగడ్డ వంటి ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఇందుకోసం నెలకు కనీసం రూ.8 వేలు ఖర్చవుతుంది. అయితే ఈ ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో వారంతా రగిలిపోతున్నారు. జగన్ సర్కారు వల్ల జీవితం నాశనమైపోయిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని డీఎస్సీకి ప్రిపేరవుతున్న శివ అనే యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. మూడేళ్లపాటు అవనిగడ్డలో శిక్షణ తీసుకున్నా నని, సుమారు మూడు లక్షల రూపాయలు తల్లిదండ్రులకు అప్పు మిగిల్చానని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లాలో అర్థం కావడం లేదన్నాడు. తనలాంటి ఎంతో మంది ఉసురు వైసీపీకి తగులుతుందని శాపనార్థాలు పెట్టాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్న కల ఎప్పటికి నెరవేరుతుందో అర్థం కావడం లేదని వెంకటేష్ అనే మరో నిరుద్యోగి వాపోయాడు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించానని, తదుపరి దశ కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నానన్నాడు. నిరుద్యోగు లను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, ప్రభుత్వ ఉద్యోగంతో ఇంటికి వెళతామని ఆశపడ్డ తనలాంటి ఎంతోమందిని వైసీపీ సర్కారు తీవ్ర నిరాశకు గురిచేసిందని లక్ష్మి తులసీ అనే డీఎస్సీ అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో భారీగా పోస్టుల భర్తీ

తెలుగుదేశం పార్టీ హయాంలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో భారీగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేశారు. పోలీస్ శాఖలో సుమారు 15 వేలకుపైగా ఖాళీలను భర్తీచేయగా, గ్రూప్-2 పోస్టుల భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. 2016లో 900 పోస్టులు, 2018లో 440 పోస్టులను భర్తీచేశారు. అలాగే 2018లో 7,900 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేసింది. ఆ తరువాత ఇప్పటివరకూ ఆయా శాఖల్లో ఒక్క కొత్త పోస్టును భర్తీచేయలేదు. కానిస్టేబుల్ నియామక ప్రక్రియ మధ్యలో ఉండగా, ఎస్ఐ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. కొద్దిరోజుల కిందటే గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునిహడావిడిగా నోటిఫికేషన్లు ఇవ్వడం తప్పితే...గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వ పెద్దల్లో కనిపించలేదని నిరుద్యోగులుఆరోపిస్తున్నారు.ఎన్నికలు దగ్గరపడుతున్న సమయం లో నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టాలని జగన్ సర్కారు చూసిందని రాజేష్ యలమల అన్నాడు.వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నాడు.

ఘోరం

... 5వ పేజీ తరువాయి

ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. కాగా ఆనందరావు కూలి పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, చంద్రశేఖర్ ఇటీవలె పదో తరగతి పరీక్షలు రాశాడు. ఈ ప్రమాద ఘటనలతో తిరుగుడుమెట్టలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చోడవరంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేష్ అన్నారు. జగన్ పాలనలో అక్రమాలకు ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, గ్రానైట్ వ్యాపారులను వైసీపీ నేతలు వేధింపులకు గురిచేసి రాష్ట్రం వదిలి పారిపోయే పరిస్థితి కల్పించారన్నారు. ఎన్నికల సమయంలో సైతం అధికార పార్టీ ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట వినలేదన్న కోపంతో వ్యాపారిపై అధికారులను ఉసిగొల్పడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు మరో 40 రోజులే ఉందని, ఆ తరువాత వారి తప్పిదాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట వినలేదనే ధర్మశ్రీ కక్ష కట్టారు: దుకాణం యజమాని

తన మాట వినలేదన్న కక్షతోనే కరణం ధర్మశ్రీ దాడులు చేయించారని టైల్స్ దుకాణం యజమాని బుచ్చిబాబు ఆరోపించారు. తన దుకాణం నుంచి టైల్స్ తీసుకుని డబ్బులు ఇవ్వలేదు సరికదా...లక్షలాది రూపాయలు అడుగుతున్నారని ఆరోపించారు. బుచ్చిబాబు కుమార్తెలు కూడా ఈ సందర్భంగా ధర్మశ్రీపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేశారు.

పెన్షన్లపై వైసీపీ దుష్ప్రచారం

... 5వ పేజీ తరువాయి

గ్రూపుల్లో ప్రచారం చేయాలని సూచించారు. అయితే వలంటీర్లంతా వైసీపీకి చెందిన కార్యకర్తలు కాబట్టే, పార్టీ కోసం పనిచేస్తున్నారనే ఎన్నికల సంఘం తీసేసింది కదా? అని చదువుకున్నవారు ఎదురు ప్రశ్నిస్తే...వారికి సమాధానం చెప్పకుండా అక్కడ నుంచి జారుకుంటున్నారు. వలంటీర్లు మాత్రమే పెన్షన్లు ఇవ్వాలని రూల్ లేదు కదా?...ఇంకెవరైనా తెచ్చి ఇవ్వవచ్చు కదా? ఎందుకు ఆ ఏర్పాట్లు చేయలేదు?...అని ప్రశ్నిస్తే వాటికి కూడా జవాబు చెప్పలేక ఆ వీధుల నుంచి వైసీపీ నాయకులు వెళ్లిపోతున్నారు. వృద్ధులం కాబట్టి తమకు ఇంటికే పెన్షన్లు ఇవ్వాలని, సచివాలయం సిబ్బందితో పంపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే నెల నుంచి తప్పనిసరిగా ఇంటికే వచ్చి ఇవ్వాలని, దానికి ప్రభుత్వం ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని పెన్షనర్లు కోరుతున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులకు ఇంకా అందని పాఠ్య పుస్తకాలు!

... 5వ పేజీ తరువాయి

టీచర్లకు పంపింది. జూన్‌లో పాఠశాలలు తెరిచేంత వరకు విద్యార్థులకు బోధన కోసం పీడీఎఫ్‌లను ఉపయోగించుకోవాలని సూచించింది. పీడీఎఫ్ ఫార్మెట్‌లో సిలబస్ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లో ఓపెన్ కావడం లేదు. ఇదిలావుండగా పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్లంతా ప్రస్తుతం మూల్యాంకనం విధుల్లో ఉన్నారు. దీంతో జిల్లాలోని 19 పాఠశాలల్లో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన ప్రశ్నార్థకంగా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నకిలీ సిగరెట్ల కేసులో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

జీఎస్టీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినప్పటికీ, పోలీసులు మాత్రం కేవలం రూ.8 లక్షలుగా లెక్కించినట్టు తెలిసింది. పైగా ఆ సరకును ఎంవీపీ కాలనీలోని ఒక ఐటీసీ డీలర్ నుంచి కొనుగోలు చేసినట్టు బిల్లు తెచ్చుకునేలా వెసులుబాటు కల్పించినట్టు ప్రచారం జరుగుతోంది. నకిలీ సిగరెట్లు, విదేశీ సిగరెట్లు, ఈ-సిగరెట్లను విక్రయించే గాజువాక ప్రాంతానికి చెందిన వ్యాపారి తన పలుకుబడి ఉపయోగించడంతో.... స్థానికంగా పలువురు ఆయ నకు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులతోపాటు జీఎస్టీకి చెందిన అధికారులు దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటపడతాయని ఐటీసీ డీలర్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

వెంకన్నకు విశేష పూజలు



అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 4: షీలానగర్ ఎన్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం భక్తులు ఊరేగింపుగా తీసుకు వచ్చిన కనకాంబరాలతో స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి సహస్ర నామార్చన, నక్షత్ర హారతి అనంతరం శాంతి కల్యాణం జరిపారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండ పై కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామికి శ్రవణా నక్షత్రం పూజలు నిర్వహించారు. ముందుగా స్వామికి పంచామృతాభిషేకం, అర్చనలు, అలంకరణ చేశారు. పూజల్లో గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ పీవీఎస్ మాధవికుమారి పాల్గొన్నారు. జీహెచ్ఎస్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌కు చెందిన టి.శ్యామ్‌ప్రసాద్, ఎం.ఉదయ్‌శంకర్, బి.రమేష్ ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. వీరికి అర్చకులు శ్రీనివాస జ్ఞాపికను అందజేశారు. కృష్ణమూర్తి, ఆదినారాయణ రావు, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి పాల్గొన్నారు.

షిర్డీసాయికి పూజలు

అగనంపూడి, ఏప్రిల్ 4: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం భక్తి గీతాలను ఆలపించారు. కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి, పంకజ, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మల్కాపురం, ఏప్రిల్ 4: దుర్గానగర్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, త్రినాథపురం, గుడివాడ అప్పన్నకాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, దుర్గానగర్, టిడ్కో బిల్డింగ్స్ ఏరియా, జనతాకాలనీ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫైనాన్స్ డైరెక్టర్‌కు అభినందనలు



ఫైనాన్స్ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ఎస్ఆర్‌వీజీకే గణేష్‌ను త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం గురువారం కలిసి అభినందించింది. ప్లాంట్ ప్రగతికి పాలకవర్గం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎంవీరమణ, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి ఉన్నారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 24, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 150, బరబాటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 170, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అనధికార పార్కింగ్‌తో అవస్థలు



ఆటోనగర్‌లో రహదారిపైనే పార్క్ చేసిన వాహనాలు



రహదారి వెంబడి భారీ ట్రాలీల పార్కింగ్

- ఆటోనగర్‌లోని ప్రధాన రహదారులు, జంక్షన్‌లలో భారీ వాహనాల నిలిపివేత
- తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు
- ఫీజు వసూలుపైనే గుత్తేదారు శ్రద్ధ

ఆటోనగర్, ఏప్రిల్ 4: ఆటోనగర్ ప్రాంతంలోని ప్రధాన రహదారులు, జంక్షన్‌ల సమీపంలో భారీ వాహనాల అనధికారిక పార్కింగ్‌పై గుత్తేదారు సానుకూలంగా వ్యవహరించడాన్ని పలువురు వాహనదారులు, ప్రయాణికులు, పారిశ్రామికవర్గాలు, కార్మికులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఆటోనగర్‌లోని బ్లాక్ డీతోపాటు పలు చోట్ల కేటాయించిన పార్కింగ్ యార్డుల్లో కాకుండా మరెక్కడా వాహనాలను నిలపరాదనే నిబంధనను పక్కకు నెట్టి ఇష్టానుసారం పార్కింగ్‌కు ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహన పార్కింగ్ ఫీజు వసూలు మినహా అనధికార పార్కింగ్‌ను నియంత్రించడంలో బాధ్యత వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీనగర్ నుంచి ఆటోనగర్ పరిశ్రమలకు చేరుకునే ఐలా ఆర్చి వద్ద, ఏపీఐఐసీ కార్యాలయం సమీపంలో తరచూ భారీ వాహనాలను నిలుపుదల చేస్తుండడంతో రాత్రివేళలో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. అరకొర విద్యుత్ వెలుగుల మధ్య ఆదమరచి ప్రయాణిస్తున్న వారు పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఈ రహదారుల్లో పలువురు మృత్యువాత పడ్డారు. అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్న వాహనానికి సంబంధించి అపరాధ రుసుం గుత్తేదారు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందనే హెచ్చరికలు జారీ చేయాల్సిన ఐలా అధికారులు, సిబ్బంది సానుకూలంగా వ్యవహరించడంతో ఆటోనగర్ ప్రాంతంలోని రహదారులు, జంక్షన్‌లు భారీ వాహనాలతో రద్దీగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



ఆటోనగర్ రహదారుల్లో ఎక్కడ బడితే అక్కడ భారీ వాహనాలు పార్కింగ్ చేస్తే సహించం. దానికంటూ ప్రత్యేకంగా యార్డు ఉంది. యార్డులో మాత్రమే పార్కింగ్ చేయాలి. పార్కింగ్ విషయమై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ అస్తవ్యస్త పార్కింగ్ వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇకపై కఠిన చర్యలు తీసుకుంటాం.

\- కె.జయచంద్ర, ఐలా కమిషనర్



62వ వార్డులో ప్రచారం చేస్తున్న పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



ఆనంద్ విజయం కోసం పూజలు చేస్తున్న రమాకుమారి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 4: ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గోపాలపట్నం బంక్ పరిసర ప్రాంతాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. తనకు ఒక్కఅవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు,రమణికుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలి

మల్కాపురం: వచ్చే ఎన్నికల్లో ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన సోదరి ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కోరారు. కొత్తనక్కావానిపాలెంలో గురువారం ప్రచారం చేశారు. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. ఆనంద్‌కుమార్ మంచి స్వభావం గల నేతని, అతనిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి మళ్లీ వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. కార్యక్రమంలో పుర్రె సురేష్, రేవల సత్యనారాయణ పాల్గొన్నారు.

62వ వార్డులో విస్తృత ప్రచారం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులో పశ్చిమ వైసీపీ అభ్యర్థి. ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం విస్తృత ప్రచారం చేశారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయాల్లో పూజలు చేశారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నదే ప్రజల కోరిక అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నేతలు కలిదిండి భద్రీనాథ్, భీశెట్టి గణేష్, నరేష్, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిగా గుడవాడ స్టీల్‌ప్లాంట్‌కు ఏం చేశారు?

- గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



రాసాలమ్మకాలనీలో ప్రచారం చేస్తున్న పల్లా, నేతలు

గాజువాక, ఏప్రిల్ 4: మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ స్టీల్‌ప్లాంట్ కోసం ఏం చేశారని గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. గాజువాకలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి అభివృద్ధికి ఏమీచేయని గుడ్డు మంత్రిని అక్కడి జనం ఛీకొట్టడంతో గాజువాకలో వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. గాజువాక ప్రజలు అమాయకులు కాదని, గట్టి సమాధానం చెబుతారన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను విక్రయిస్తున్నప్పుడు ఏం చేశావని ప్రశ్నించారు. ప్రజలకు నోట్ల కట్టలు ఇచ్చి గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వస్తుందనగా రాష్ట్ర సంపదను బినామీ కాంట్రాక్టర్లకు ముఖ్యమంత్రి దోచి పెట్టారన్నా రు. జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు చేసిన అంతిమ విజయం కూటమిదేనన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పల్లా అన్నారు. జీవీఎంసీ 72వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, ప్రసాదుల శ్రీనివాస్, అప్పారావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: అరాచకశక్తులపై జరుగుతున్న పోరాటంలో అంతిమ విజయం కూటమిదేనని పల్లా అన్నారు. రాసాలమ్మ కాలనీలో గురువారం రాత్రి టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని దయనీయస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రశాంత నగరంలో ప్రశాంతత కరువైందన్నారు. అధికార పార్టీ ఎంపీకే రక్షణ కరువైందన్నారు. జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడారు. నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, వేగుంట శ్రీనివాస్, కనకరాజు, జనసేన నాయకులు కాదా శ్రీను, కళావతి, లంకల మురళీ దేవి, బీజేపీ నాయకులు బొండా శ్రీదేవి, బొండా ఎల్లాజీ, వెన్నా శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలివ్వలేని స్థితికి దిగజార్చిన కేంద్రం

- ఉక్కు పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



ప్రసంగిస్తున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 4: ఉక్కు కార్మాగారాన్ని కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజార్చిందని ఉక్కు పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. రిలే దీక్షల్లో గురువారం ఆయన మాట్లాడుతూ ప్లాంట్ మూసివేతకు కుట్ర పూరిత ఆలోచనల్లో భాగంగా కేంద్రం ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ వస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడాల్సిన పలు రాజకీయ పార్టీలు చోద్యం చూడడం దురదృష్టకరమన్నారు. చరిత్ర కలిగిన ఉక్కు కర్మాగార పరిరక్షణకు రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఉక్కు పరిరక్షణకు నడుం బిగించని రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

'గెస్ట్‌హౌస్ లీజు ప్రతిపాదన విరమించుకోవాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉక్కు హౌస్, గంగవరం గెస్ట్‌హౌస్ లీజు ప్రతిపాదనలను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని ఉక్కు సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటీ.దాసు, యూ రామస్వామిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీటిని 30ఏళ్ల లీజు పేరుతో ప్రైవేట్ వారికి అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు ఉద్యోగులకు అందుబాటులో ఉండే ఉక్కుహౌస్‌లను లీజుకు ఇవ్వటం సరికాదన్నారు. ఉద్యోగులు ఆందోళన చేపట్టకముందే యాజమాన్యం ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సందడిగా మరిడిమాంబ అమ్మవారి పండగ



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని మరిడిమాంబ వార్షిక మహోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, డప్పులు, వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, తిప్పల విజయమ్మ, అన్నపూర్ణ, గుర్రం పద్మావతి, మామిడి నరసింగరావు పాల్గొన్నారు.

బొర్రమాంబకు మంగళ సూత్రం బహూకరణ

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ అమ్మవారికి స్థానిక అధ్యాత్మిక సేవకుడు కొయ్య వెంకట కృష్ణారెడ్డి బంగారు మంగళ సూత్రాలను బహూకరించారు. గురువారం అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు ఆలయ కమిటీ చేతుల మీదుగా మంగళ సూత్రాలను అందజేశారు.

ముగిసిన ఆలయ ప్రారంభోత్సవాలు

పెందుర్తిరూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న నూతనంగా నిర్మించిన వేదమాత గాయత్రీదేవి ఆలయ ప్రారంభోత్సవాలు ముగిశాయి. గాయత్రీ ఉపాసకుడు కెంగువ రామకృష్ణస్వామి సంకల్పంతో నిర్వహించిన వేడుకల్లో విశ్వంజీ మహారాజ్, పెంటకోట బాలమురళీకృష్ణ గురుస్వామి, బ్రహ్మశ్రీ నేతేటి రుద్రవర్ధన్ నాగేశ్వరరావు శర్మ, వేద పండితులు పాల్గొన్నారు. చివరిరోజు గురువారం పండితులు కలశ స్థాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

ఘనంగా ముత్యాలమ్మ పండగ

వేపగుంట: వేపగుంట పరిసర గ్రామాల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ అమ్మవారు మారువారం పండుగ గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి జల, పాలాభిషేకాలు, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం సామూహిక లలితా సహస్ర పారాయణం చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డులో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వయంగా అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు సామూహిక కనకధార స్తోత్ర పారాయణం చేశారు.

కార్పొరేటర్ పీలాతో సీఎం రమేష్, పంచకర్ల భేటీ



మాట్లాడుతున్న పీలా శ్రీనివాసరావు, పక్కన సీఎం రమేష్, పంచకర్ల

పెందుర్తి, ఏప్రిల్ 4: జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావుతో గురువారం అనకాపల్లి బీజేపీ లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్, పెందుర్తి శాసన సభ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తిలో కలిశారు. ఈ సందర్భంగా పీలా స్వగృహంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులుగా బరిలో నిలిచిన తమ విజయానికి సహకరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామని, కూటమి అభ్యర్థుల విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని పీలా అన్నారు. పెందుర్తి, అనకాపల్లిలో టీడీపీ నేతలు బండారు సత్యనారాయణ మూర్తి, పీలా గోవింద్ చేసిన త్యాగాలకు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా సీఎం రమేశ్, పంచకర్ల తెలిపారు. కూటమితో వైసీపీ వెన్నులో వణుకు పుట్టిందన్నారు. ధర్మ యుద్ధంలో కూటమిదే విజయమనం పీలా అన్నారు. అంతకుముందు సీఎం రమేశ్, పంచకర్లను పీలా పుష్పగుచ్ఛాలు అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, టీడీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేటర్ బల్ల శ్రీనుకు పరామర్శ

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావును అనకాపల్లి బీజేపీ లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్, పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాసరావును వేపగుంటలోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో అంతా కలిసి పనిచేసి కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



58వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 4: తెలుగుదేశంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. గ్రేటర్ విశాఖ 60వ వార్డు కోరమాండల్ గేటు ఎదురుగా ఉన్న జీవీఎంసీ వాకర్స్ మైదానంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. మైదానంలోని క్రీడాకారులను కలిసి మాట్లాడారు. తను ఎ మ్మెల్యేగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలంతా ఎంతో స్వేచ్ఛగా ఉంటారన్నా రు. టీఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు మాతా శ్రీను, నాయకులు చిన్న, పూడి భాస్కర్‌రావు, మజ్జి మాలినాయుడు, నరసింగరావు, అప్పన్న, పెంటకోట హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదు

రాజకీయ జోక్యం ఉన్న వలంటీర్లను మాత్రమే టీడీపీ వ్యతిరేకిస్తోందని, ప్రజలకు సేవలందిస్తున్న వారికి మాత్రం కాదని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గణబాబు అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లకు రానున్న ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తే న్యాయం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులే పెన్షన్‌ను మంజూరుచేయాలని ఎన్నికల సంఘం చెప్పినట్టు చెప్పారు. కానీ, వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, కాకిపోలిరెడ్డి, విశ్వనాథుల దినకర్, మితిరెడ్డి శంకర్, పూడి బాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో ప్రచారం

గ్రేటర్ 58వ వార్డులో గణబాబు గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పుట్టిందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, కోరాడ శ్రీనివాసరావు, బుద్ధ త్రినాద్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి




ఈడీతో చర్చిస్తున్న ఇంటక్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే జీతాలు ఇవ్వాలని ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) శాంతకుమార్, సీజీఎం (హెచ్ ఆర్) గాంధీని ఉక్కు ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు నేతృత్వంలో నాయకులు గురువారం కలిసి విన్నవించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రస్తు తం యాజమాన్యం ప్రవర్తిస్తోందని, జీతాలు ఆలస్యంతో బ్యాంకులకు చెల్లించాల్సిన ఈఎంఐ చెల్లించలేక, డిఫాల్ట్‌గా మారుతున్నామని పేర్కొన్నారు. కేవలం రూ. 83 కోట్లు కార్మికులకు జీతాల రూపంలో ఇవ్వటానికి యాజమాన్యం వెనకాడడం దారుణమన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, గోపి, మోహన్ పాల్గొన్నారు.

షిప్‌యార్డులో జాతీయ సముద్ర తీర దినోత్సవం

- షిప్‌యార్డు ఆవిర్భావానికి కృషి చేసిన వారికి ఘన నివాళి



భారతదేశ తొలి నౌక ఎస్ఎస్ లాయల్టీ

మల్కాపురం, ఏప్రిల్ 4: షిప్‌యార్డులో జాతీయ సముద్రతీర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ అధికారులు మాట్లాడుతూ, 5 ఏప్రిల్ 1919న సింధియా స్టీమ్ నావిగేషన్‌కు చెందిన తొలి భారతీయ యజమాన్యంలోని ఓడ ఎస్ఎస్ లాయల్టీ ముంబై నుంచి లండన్‌కు బయలుదేరిందన్నారు. అప్పటికి షిప్పింగ్‌మార్గాలు, కంపెనీలు, వాణిజ్యం, మహాసముద్రాలు బ్రిటీష్ వారి ఆధిపత్యంలోనే ఉన్నాయన్నారు. అయినా సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీని సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్, నరోత్తమ్ మొరాజీ, కిలాచంద్ దేవాచంద్, సేఠ్‌వాలయంథ్ ప్రారంభించి దేశానికి గొప్ప మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. స్వదేశీ షిప్‌యార్డు అవసరమని గుర్తించారని, ఈ నేపథ్యంలో 1941లో విశాఖ సముద్రతీరంలో షిప్‌యార్డును నిర్మించినట్టు తెలిపారు. ఇది దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. షిప్‌యార్డులో ఆధునిక యుద్ధ నౌకల నిర్మాణం సందర్భంగా సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్‌కు నివాళులర్పించారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం: జేసీ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 4: నామినేషన్ల ప్రక్రియ, బ్యాలెట్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తూర్పు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్నిఅంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్కోర్ ద్వారా అనుమతులు జారీ ప్రక్రియ, శిక్షణ సదస్సులు, పరిశీలన ప్రక్రియ తదితర అంశాలను తెలుసుకోవాలన్నారు. సంబంధిత సామగ్రి, సాంకేతిక పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల కూడలి

- సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదుట ట్రాఫిక్ నియంత్రణ శూన్యం
- ఇష్టారీతిగా వాహనాల రాకపోకలు.. చోదకులకు అవస్థలు



కూడలిలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



వృథాగా రోడ్డు పక్కన పడేసిన ట్రాఫిక్ ఐల్యాండ్

సీతమ్మధార, ఏప్రిల్ 4:నగరంలోని ప్రధాన మార్గాల్లో ఒకటైన సీతమ్మధార మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో నిత్యం కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నగరంలోని ఎటు వెళ్లాలన్నా ఇది ఉపయోగకరం. అటువంటి రహదారిలో యూనియన్ బ్యాంకికి సమీపంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గల జంక్షన్‌లో ట్రాఫిక్ ప్రమాదభరితంగా మారింది. అక్కడ ఎటువంటి సిగ్నల్ పాయింట్లు లేకపోవడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎవరు ఉండరు. ఈ రోడ్డులో రోజూ ఏదో ఒక పార్టీకి చెందిన రాజకీయనాయకులు, లేదా జీవీఎంసీఅధికారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ, ట్రాఫిక్ సరిదిద్దే చర్యలు తీసుకోవడంలేదు ఈ కూడలిలో గతంలో ట్రాఫిక్ ఐల్యాండ్ గతంలో ఉండేది. అక్కడ ట్రాఫిక్ పోలీసులను నియమించాలని అధికారులు నిర్ణయించారు. అయితే, ఆ ట్రాఫిక్ ఐల్యాండ్‌ను అక్కడి నుంచి తొలగించి రోడ్డు పక్కన పడేశారు. అది ఇప్పుడు దేనికీ పనికిరాకుండా దర్శనమిస్తోంది. సీతమ్మధారకూడలి నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లడానికి, సత్యం కూడలి నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలికి వెళ్లేందుకు మధ్యలోనున్న ఈ జంక్షన్‌నుంచి ఇటునక్కవానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, కేఆర్ఎం కాలనీ తదితర ప్రాంతల నుంచి వచ్చే ప్రజలకు ఇదే దారి. అదే విధంగా గురుద్వారా నుంచి సీతమ్మధార, మద్దిలపాలెం తదితర ప్రాంతాలకు వచ్చేందుకు ఈ కూడలి ప్రధానమైనది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ లేక వాహనాలు రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ అంతరాయం నెలకొంటోంది. కూడలిలో కొంతమంది రాంగ్ రూట్ నుంచి వస్తుండటంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు రోడ్డు దాటడానికి కష్టతరంగా మారుతోంది. గతంలో కన్నా రహదారి విస్తరించినా సిగ్నల్ పాయింట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ జంక్షన్ వద్ద పోలీసులు తరచూ వాహనాలు తనిఖీ చేస్తుంటారు. ఇంత ప్రాధాన్యం గల ఈ జంక్షన్‌లో ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేలా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మురళీనగర్‌లోని పోస్టాఫీస్ తరలించొద్దు..!

మురళీనగర్, ఏప్రిల్ 4 ; మురళీనగర్‌లోని పోస్టాఫీస్‌ను తరలించే ప్రయత్నాలపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దాదాపు 30 ఏళ్ల కిందట పోస్టల్ వినియోగదారులకు సేవింగ్ అకౌంట్స్ , పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ ప్లాన్‌లతో సమీప మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీఏస్ కాలనీ వాసులకు అందుబాటులో ఇక్కడ పోస్టాఫీసు ఏర్పాటుచేశారు. గురువారం ఒక్కసారిగా ఇక్కడి పోస్టల్ శాఖ ఖాళీ చేసి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని పోస్టల్ కార్యాలయానికి తరలిస్తున్నట్టు అధికారులు తెలియజేయడంతో మురళీనగర్ వాసులు అసంతృప్తికి గురయ్యారు. వెంటనే మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోస్టల్ శాఖ జిల్లా అధికారులకు తమ వినతి పత్రమిచారు. స్థానికుల కోరిక మేరకు ఈ శాఖను ఇక్కడే కొనసాగించాలని కోరారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం?

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : వృద్ధురాలిపై ఇద్దరు ఆకతాయిలు లైంగిక వేధింపులు, అత్యాచారయత్నం చేసినట్టు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు అందినట్టు తెలిసింది. జాలారిపేటకు చెందిన వృద్ధురాలిపై మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు వేధింపులకు పాల్పడినట్టు సమాచారం. పూర్తి వివరా లు సేకరించాల్సి ఉందని పోలీసులు చెపుతున్నారు.

నూకాంబిక ఉత్సవాల్లో శ్రీభరత్



పూజల్లో పాల్గొన్న శ్రీభరత్, గండి బాబ్జీ

కంచరపాలెం, ఏప్రిల్ 4 : కంచరపాలెం పరిధి జైభారత్ నగర్‌లో కొలువైన నూకాంబిక ఉత్సవాల్లో టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ గురువారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని భరత్ ప్రారంభించారు. ఆధ్యాత్మికత భావనతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని అన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

92శాతం పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్లు 92శాతం పంపిణీ పూర్తి చేసినట్టు కలెక్టర్ డాక్టరు ఎ. మల్లికార్జున తెలిపారు. పింఛన్ల పంపిణీ రెండో రోజు గురువారం సాయంత్రానికి 1,65,432కి గాను 1,51,557 మంది అందజేశామన్నారు. పలు కారణాలతో ఇళ్లకే పరిమితమైన 8,674 మందికి, దూర ప్రాంతాల్లో ఉన్న 8964 మందికి ఆయా చోట్లకు వెళ్లి పింఛన్లు అందించినట్టు వివరించారు. ఈనెల ఆరోతేదీ వరకు పింఛన్లు పంపిణీ కొనసాగుందన్నారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో ప్రథ మస్థానంలో నిలిచామన్నారు.

నిరుద్యోగులకు నయవంచన

... 5వ పేజీ తరువాయి

80 శాతం మంది పోలీస్, ఉపాధ్యాయ పోస్టుల కోసం శిక్షణ పొందుతున్నారు. వీరంతా విశాఖతోపాటు కాకినాడ, అవనిగడ్డ వంటి ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఇందుకోసం నెలకు కనీసం రూ.8 వేలు ఖర్చవుతుంది. అయితే ఈ ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో వారంతా రగిలిపోతున్నారు. జగన్ సర్కారు వల్ల జీవితం నాశనమైపోయిందని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని డీఎస్సీకి ప్రిపేరవుతున్న శివ అనే యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. మూడేళ్లపాటు అవనిగడ్డలో శిక్షణ తీసుకున్నా నని, సుమారు మూడు లక్షల రూపాయలు తల్లిదండ్రులకు అప్పు మిగిల్చానని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లాలో అర్థం కావడం లేదన్నాడు. తనలాంటి ఎంతో మంది ఉసురు వైసీపీకి తగులుతుందని శాపనార్థాలు పెట్టాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్న కల ఎప్పటికి నెరవేరుతుందో అర్థం కావడం లేదని వెంకటేష్ అనే మరో నిరుద్యోగి వాపోయాడు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించానని, తదుపరి దశ కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నానన్నాడు. నిరుద్యోగు లను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, ప్రభుత్వ ఉద్యోగంతో ఇంటికి వెళతామని ఆశపడ్డ తనలాంటి ఎంతోమందిని వైసీపీ సర్కారు తీవ్ర నిరాశకు గురిచేసిందని లక్ష్మి తులసీ అనే డీఎస్సీ అభ్యర్థిని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో భారీగా పోస్టుల భర్తీ

తెలుగుదేశం పార్టీ హయాంలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో భారీగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీచేశారు. పోలీస్ శాఖలో సుమారు 15 వేలకుపైగా ఖాళీలను భర్తీచేయగా, గ్రూప్-2 పోస్టుల భర్తీకి రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చారు. 2016లో 900 పోస్టులు, 2018లో 440 పోస్టులను భర్తీచేశారు. అలాగే 2018లో 7,900 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేసింది. ఆ తరువాత ఇప్పటివరకూ ఆయా శాఖల్లో ఒక్క కొత్త పోస్టును భర్తీచేయలేదు. కానిస్టేబుల్ నియామక ప్రక్రియ మధ్యలో ఉండగా, ఎస్ఐ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. కొద్దిరోజుల కిందటే గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునిహడావిడిగా నోటిఫికేషన్లు ఇవ్వడం తప్పితే...గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వ పెద్దల్లో కనిపించలేదని నిరుద్యోగులుఆరోపిస్తున్నారు.ఎన్నికలు దగ్గరపడుతున్న సమయం లో నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టాలని జగన్ సర్కారు చూసిందని రాజేష్ యలమల అన్నాడు.వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నాడు.

ఘోరం

... 5వ పేజీ తరువాయి

ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. కాగా ఆనందరావు కూలి పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, చంద్రశేఖర్ ఇటీవలె పదో తరగతి పరీక్షలు రాశాడు. ఈ ప్రమాద ఘటనలతో తిరుగుడుమెట్టలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చోడవరంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

సీఎం రమేష్ అన్నారు. జగన్ పాలనలో అక్రమాలకు ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, గ్రానైట్ వ్యాపారులను వైసీపీ నేతలు వేధింపులకు గురిచేసి రాష్ట్రం వదిలి పారిపోయే పరిస్థితి కల్పించారన్నారు. ఎన్నికల సమయంలో సైతం అధికార పార్టీ ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట వినలేదన్న కోపంతో వ్యాపారిపై అధికారులను ఉసిగొల్పడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు మరో 40 రోజులే ఉందని, ఆ తరువాత వారి తప్పిదాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట వినలేదనే ధర్మశ్రీ కక్ష కట్టారు: దుకాణం యజమాని

తన మాట వినలేదన్న కక్షతోనే కరణం ధర్మశ్రీ దాడులు చేయించారని టైల్స్ దుకాణం యజమాని బుచ్చిబాబు ఆరోపించారు. తన దుకాణం నుంచి టైల్స్ తీసుకుని డబ్బులు ఇవ్వలేదు సరికదా...లక్షలాది రూపాయలు అడుగుతున్నారని ఆరోపించారు. బుచ్చిబాబు కుమార్తెలు కూడా ఈ సందర్భంగా ధర్మశ్రీపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేశారు.

పెన్షన్లపై వైసీపీ దుష్ప్రచారం

... 5వ పేజీ తరువాయి

గ్రూపుల్లో ప్రచారం చేయాలని సూచించారు. అయితే వలంటీర్లంతా వైసీపీకి చెందిన కార్యకర్తలు కాబట్టే, పార్టీ కోసం పనిచేస్తున్నారనే ఎన్నికల సంఘం తీసేసింది కదా? అని చదువుకున్నవారు ఎదురు ప్రశ్నిస్తే...వారికి సమాధానం చెప్పకుండా అక్కడ నుంచి జారుకుంటున్నారు. వలంటీర్లు మాత్రమే పెన్షన్లు ఇవ్వాలని రూల్ లేదు కదా?...ఇంకెవరైనా తెచ్చి ఇవ్వవచ్చు కదా? ఎందుకు ఆ ఏర్పాట్లు చేయలేదు?...అని ప్రశ్నిస్తే వాటికి కూడా జవాబు చెప్పలేక ఆ వీధుల నుంచి వైసీపీ నాయకులు వెళ్లిపోతున్నారు. వృద్ధులం కాబట్టి తమకు ఇంటికే పెన్షన్లు ఇవ్వాలని, సచివాలయం సిబ్బందితో పంపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే నెల నుంచి తప్పనిసరిగా ఇంటికే వచ్చి ఇవ్వాలని, దానికి ప్రభుత్వం ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని పెన్షనర్లు కోరుతున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులకు ఇంకా అందని పాఠ్య పుస్తకాలు!

... 5వ పేజీ తరువాయి

టీచర్లకు పంపింది. జూన్‌లో పాఠశాలలు తెరిచేంత వరకు విద్యార్థులకు బోధన కోసం పీడీఎఫ్‌లను ఉపయోగించుకోవాలని సూచించింది. పీడీఎఫ్ ఫార్మెట్‌లో సిలబస్ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లో ఓపెన్ కావడం లేదు. ఇదిలావుండగా పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్లంతా ప్రస్తుతం మూల్యాంకనం విధుల్లో ఉన్నారు. దీంతో జిల్లాలోని 19 పాఠశాలల్లో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన ప్రశ్నార్థకంగా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నకిలీ సిగరెట్ల కేసులో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

జీఎస్టీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినప్పటికీ, పోలీసులు మాత్రం కేవలం రూ.8 లక్షలుగా లెక్కించినట్టు తెలిసింది. పైగా ఆ సరకును ఎంవీపీ కాలనీలోని ఒక ఐటీసీ డీలర్ నుంచి కొనుగోలు చేసినట్టు బిల్లు తెచ్చుకునేలా వెసులుబాటు కల్పించినట్టు ప్రచారం జరుగుతోంది. నకిలీ సిగరెట్లు, విదేశీ సిగరెట్లు, ఈ-సిగరెట్లను విక్రయించే గాజువాక ప్రాంతానికి చెందిన వ్యాపారి తన పలుకుబడి ఉపయోగించడంతో.... స్థానికంగా పలువురు ఆయ నకు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులతోపాటు జీఎస్టీకి చెందిన అధికారులు దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటపడతాయని ఐటీసీ డీలర్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

విశాఖ వాసులు విధ్వంసాన్ని కాదు... అభివృద్ధి ఆశిస్తున్నారు

- టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



31వ వార్డులో ప్రచారం చేస్తున్న శ్రీభరత్, వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 4: విశాఖ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, విధ్వంసాలను కాదని టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి ఎం. శ్రీభరత్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులో గురువారం సాయంత్రం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణయాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను రాజధానిగా చేస్తామని ఇక్కడి ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి రుణాలు పొందారని వైసీపీ ప్రభుత్వాన్నిఉద్దేశించి విమర్శించారు. కనీసం రైల్వే డివిజన్‌కు స్థలం కేటాయించలేకపోయారని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని ఈసందర్భంగా అన్నారు. వంశీకృష్ణయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలను ప్రతిపక్ష పార్టీలకు ఆపాదించి వైసీపీ ప్రభుత్వం రాక్షస రాజకీయాలకు తెరతీసిందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ మాట్లాడుతూ శ్రీభరత్ వంటి సమర్థులను విశాఖ తరపున పార్లమెంట్‌కు పంపాలని కోరారు. వంశీ కృష్ణ విజయంకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీసాగిస్తున్న దుష్టపాలనకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ పిలుపునిచ్చారు. వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేందుకు కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఏప్రిల్ 4: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార అభయ ఆంజనేయస్వామి ఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ డౌన్, ఆర్ అండ్‌బీ క్వార్టర్స్, సబ్బంహరి గృహం ఉన్నప్రాంతం, టీపీటీ కాలనీ, ఎన్‌టీఎంలా కాలేజీ, పీఅండ్‌టీ కాలనీ, గాంధీనగర్, పోస్టాఫీస్ ప్రాంతం, ఎఎస్ఆర్ నగర్, రాకెట్ పార్క్ ప్రాంతం, హిల్‌వ్యూ పార్కు, తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్కయ్యపాలెం ప్రాంతంలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ వర్గాలు తెలిపాయి. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, అబిద్‌నగర్ ప్రాంతాల్లో వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా ఆళ్వారుల, శ్రీ రామానుజు విగ్రహాల ఆవిష్కరణ



అభిభాషణ చేస్తున్న చిన జియర్ స్వామి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 4: జీవీఎంసీ 87వ వార్డు రాజులపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గురువారం ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి సుప్రభాతం, విశేష ద్వార తోరణ పూజ, నిత్య హోమాలు, ధ్వజ స్తంభానికి కుంభ పూజ, విష్ణు సహస్ర నామ పారాయణం తదితర వాటిని నిర్వహించారు. అనంతరం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆళ్వారు, శ్రీ రామానుజు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పల్గొన్నారు.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల ఐసీయూ పునఃప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, ఏప్రిల్ 4: కేజీహెచ్‌లో ఆధునికీకరించిన చిన్న పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను గురువారం పునఃప్రారంభించారు. ఆస్పత్రిలో చి న్నారులకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో రూ. 80 లక్షల నిధులతో పీ ఐసీయూలో పూర్తిస్థాయిలో వెంటిలేటర్లు, ఏసీ, ఆధునాతన పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఈసందర్భంగా తెలిపారు. అలాగే, కా ర్డియాలజీ విభాగంలో రూ. 25 లక్షలతో చేపడుతున్న పనులు, రూ. 15 ల క్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం వారధి తదితర నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపాల్, వైద్యులు అధికారులు పాల్గొన్నారు. చిన్న పిల్లలల యూనిట్ ఆధునికీకరణ పనులు పూర్తవడంతో ఎన్నికల నిబంధనలకు లోబడి ఈకార్య క్రమం చేపట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

అప్పులు తీర్చలేదని యువకుడి నిర్బంధం

- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, ఐరన్ ఊచలు

మర్రిపాలెం, ఏప్రిల్ 4: బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువకుడిని తమ అప్పులు తీర్చాలని కొంతమంది నిర్బం, దించి, హింసించిన ఘటన ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జీలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలివి.. మాధవధార ఉడాలే అవుట్‌లో నివాసముంటున్నా సనపల రాఘవ బెట్టింగ్‌లో అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో నష్టపోవడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులవాళ్ల బాధపడలేక ఇంటినుంచి వచ్చి ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జీలో ఆరు నెలలు ఉన్నాడు. ఈ సమయంలో లాడ్జీ నిర్వాహకుడు బలగ సంతోష్ వద్ద రూ. 5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సంతోష్ ద్వారా పరిచయమైన సుజాత నగర్‌కి చెందిన ఆదర్శ్‌రెడ్డిని అప్పుగా అడగడంతో... ఆయన దున్న వివేక్ అనే వ్యక్తి వద్దనుంచి రూ.11లక్షలు తీసుకుని రాఘవకు ఇచ్చాడు. వీరు నిత్యం డబ్బుల కోసం ఒత్తిడి తేవడంతో కొద్దిరోజుల కిందట లాడ్జీ నుంచి వెళ్లిపోయాడు. దీంతో రాఘవకు ఫోన్ చేసి లాడ్జీకి రప్పించారు. వీరితోపాటు పిళ్లా శ్రీనివాసరావు సహకారంతో ఎలాగైనా రాఘవవద్ద నుంచి డబ్బులు వసూలు చేసేందుకు నిర్బంధించారు. భయపెట్ట డంతోపాటు హింసించారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు లాడ్జీలో నిర్బంధంలో ఉన్న రాఘవను, నిందితులను అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసు లకు అప్ప గించారు. వీరివద్ద నుంచి ఐరాన్‌రాడ్డు, 3 బటన్ కత్తులు, సాధారణ కత్తి ఒకటి, ఒక సర్జికల్ కత్తి, 8 కొత్త సెల్‌ఫోన్లు, 4 పాత సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సంతోష్, ఆదర్శ్‌రెడ్డి, శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. రాఘవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై 367, 307 సెక్షన్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెస్ట్‌హౌసుల లీజుతో భద్రతకు ముప్పు

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు గంగవరం, స్టీల్ గెస్ట్‌హౌస్‌లను దీర్ఘకాలిక లీజుకు ఇచ్చి దేశ భద్రతకు, కార్మిక కుటుంబాల రక్షణకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్ ఆరోపించారు. గంగవరం పోర్టును ప్రైవేటుకు ఇచ్చినపుడే తూర్పు నౌకాదళం భద్రత రీత్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని, అయినా లెక్క చేయకుండా ఇచ్చేశారని విమర్శించారు. ఇప్పుడు అక్కడి గెస్ట్‌హౌస్‌ని లీజుకు ఇస్తే.. శత్రువులు అందులో కూర్చొని నగరాన్ని ఎలా నాశనం చేయవచ్చనో ప్రణాళికలు వేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. గతంలో ఉక్కు క్లబ్‌ని ప్రైవేటుకు ఇస్తే పేకాట ఆడారని, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఉక్కు ఉద్యోగుల రిఫరెన్స్ లేదని అక్కడి గదులను బయట వారికి ఇవ్వరని, ఉక్కు టౌన్‌షిప్‌లో అది ఉండటమే దానికి కారణమన్నారు. ఇవన్నీ పక్కన పెట్టి ఇప్పుడు ఎవరికో లీజుకు ఇచ్చేస్తే ఉక్కు కుటుంబాల భద్రతకు దిక్కు ఎవరని ప్రశ్నించారు. ఉక్కు ఉత్పత్తి, విక్రయాలు పెంచడంపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం కేవలం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల ఆదాయం వచ్చే వీటిపై పని చేయడం, అది కూడా విశాఖ రక్షణకు భంగం కలిగేలా నిర్ణయం తీసుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ఈ నోటిఫికేషన్‌ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఏప్రిల్ 4 : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగారు సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృశింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున బంగారు సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.

టీటీడీలో పంచాంగం విక్రయాలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : ఎంవీపీ కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో 2024 సంవత్సరం శ్రీ క్రోధి నామ సమత్సర సిద్ధాంత పంచాంగం విక్రయాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. అవసరమైన వారు నేరుగా కార్యాలయానికి వచ్చి, రూ.75 చెల్లించి పొందవచ్చని టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

విలేకరులపై దాడులు సరికాదు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : తమ అవినీతి, అక్రమాలను బయట పెడుతున్నారన్న అక్కసుతో వైసీపీ నాయకులు విలేకరులపై దాడులు చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ ఆరోపించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం అర్ధరాత్రి కుక్కర్లు పంపిణీ చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. అవి వైసీపీకి సంబంధించినవి కాకపోతే విలేకరుల కెమెరాలు లాక్కుని, డేటా ఎందుకు డిలీట్ చేశారని అడిగారు. పోలీసులు కూడా జరుగుతున్న దాన్ని చోద్యం చూడడం, చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కంటే వైసీపీ కోడ్ నడుస్తోందని అర్థమవుతోందన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మత్స్యకారులకు వలలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 4 : మండలంలోని నాగమయ్యపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులకు దివీస్ కంపెనీ ప్రతినిధులు గురువారం వలలు పంపిణీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి వలలు పోగొట్టుకుని ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు సుమారు రూ 5. 20 లక్షలతో వలలు కొనుగోలు చేసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సామాజిక సేవా విభాగానికి చెందిన డి.సురేష్‌కుమార్, కె.శ్రీనివాస్, కె. నరసింహ, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

తగరపువలస, ఏప్రిల్ 4 : జీవీఎంసీ బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఎక్కు వగా నీరు తాగాలని, బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వాతి. దేవి, ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

మధురవాడ, ఏప్రిల్ 4 : జీవీఎంసీ 5వ వార్డు బోయపాలెం వద్ద అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 19 సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు పీఎం పాలెం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు మేరకు.. శివశక్తినగర్‌కు చెందిన బుచ్చయ్య ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సీసాలు కొనుగోలు చేసి వాటిని బోయపాలెం వద్ద అనధికారికంగా విక్రయిస్తున్నట్టు పోలీసు లకు సమాచారం అందింది. ఈమేరకు అతని ఇంటి వద్ద సోదా చేసి 19 సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, శారద, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-1, హెవెన్, లక్ష్మీకాంత్ (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 24, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 150, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 170, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



జెట్టీ నిర్మాణానికి ప్రతిపాదించిన తీరంలోని ప్రాంతం



డచ్ ఓడరేవు నిర్వహించిన ఉప్పుటేరు

జెట్టీ నిర్మాణం..ఎన్నికల హామీకే పరిమితం

- ఏళ్ల తరబడి నెరవేరని మత్స్యకారుల కల
- మాటలతో సరిపెడుతున్న నాయకులు
- మళ్లీ అదే అంశంపై ప్రచారం

భీమునిపట్నం, ఏప్రిల్ 4 : పట్టణంలో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం ఎన్నికల హామీకే పరిమితమైంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు ప్రజలను మభ్య పెట్టడానికి ఈ హామీ ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. 17వ శతాబ్దంలో భీమిలిలో డచ్ ఓడ రేవు చారిత్రక ప్రాధాన్యత పొందింది. విశాఖ పోర్టు ప్రారంభమైన తర్వాత ఓపెన్ యాంకరింగ్ పోర్టుగా వున్న ఈ ఓడ రేవును భారత ప్రభుత్వం భద్రతా కారణాల వల్ల మూసివేసింది. దీనికి 1964లో చివరిసారి ఇండియన్ ట్రేడర్ నౌక వచ్చింది. అప్పటి నుంచి ఈ రేవు ప్రదేశంలో జెట్టీ నిర్మిస్తామని ప్రతి ఎన్నికల్లోనూ నాయకులు హామీ ఇస్తున్నా.. నెరవేర్చడం లేదు.ఎన్నికలకు ముందు అప్పటికి ఎమ్మెల్యేగా ఉన్నవారు జిల్లా మత్స్యశాఖాధికారులను భీమిలి తీరానికి తీసుకురావడం, వారి వెనుక రాజకీయ నాయకులు, మత్స్యకారులు గుమిగూడడం ప్రతిపాదనలు సిద్ధం చేయడం చేస్తున్నారు తప్ప, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, జెట్టీ నిర్మాణం చేపట్టడం లేదు. అయితే ఈసారి విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రెండుసార్లు ఇక్కడి నుంచి గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కూడా 2014లో ఎమ్మెల్యేగా పనిచేసారు. వీరిద్దరూ అప్పట్లో కూడా ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. గత ఏడాది మే నెలలో విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి జగన్ నగరంలో వర్చువల్ విధానంలో భీమిలిలో ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భీమిలి ఉప్పుటేరు నుంచి గోస్తనీ నది ప్రవహించే మూలకుద్దు తీరం వైపు ఆరు ఎకరాల విస్తర్ణంలో రూ.28.70 కోట్లతో మినీ జెట్టీ నిర్మాణానికి ప్రతిపాదించారు. దీనికి రాష్ట్ర సముద్ర తీర మౌలిక వసతుల కల్పన సంస్థ, ఏపీ మారిటైమ్ బోర్డు సంయుక్తంగా బాధ్యతలు చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత స్థలానికి సర్వే చేసినట్టు మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా జెట్టీ నిర్మాణానికి ఏ విధమైన పనులు ప్రారంభం కాకపోవడం, ఎన్నికలు రావడంతో మళ్లీ ఈ విషయమై నేతలు హామీ ఇవ్వడం ఖాయమని పలువురు విమర్శిస్తున్నారు.

కాగా భీమిలి తీరంలో అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, భీమిలి, పెద ఉప్పాడ, కాపుల దిబ్బడిపాలెం, మంగమారిపేటల్లో మత్స్యకారులు ఏడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. సముద్రంపై వేటాడిన సంపదను ఆయా ల్యాండింగ్ సెంటర్లకు తీసుకువచ్చి బోట్లను ఒడ్డున నిలుపుతారు.భీమిలిలో చిట్టివలస మీదుగా ప్రవహించే గోస్తనీ ఉప్పుటేరు మీదుగా సముద్రం కలుస్తుంది.ఆటుపోటుల ప్రభావంతో ఒక్కోసారి ఉప్పుటేరు, సముద్రంకు మధ్య ఇసుకమేటలు వేస్తుంది. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీనికి జెట్టీ వస్తే సముద్రంలో డ్రెడ్జింగ్ చేయడం వల్ల బోట్లను లంగరు వేసుకోవడం తదితర సదుపాయాలు ఏర్పాటుతో ఎంతో సౌకర్యంగా వుంటుందని మత్స్యకారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



పొట్నూరు గ్రామంలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



భీమిలి : వైసీపీలో చేరిన వారితో శ్రీనివాసరావు

వైసీపీ పాలనతోనే ప్రజా సంక్షేమం : ముత్తంశెట్టి

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 4 : వైసీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పొట్నూరు గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆలయాల్లో పూజలు జరిపారు. అనంతరం ఇంటిం టికి వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ ఎంతగానో కృషి చేశారని, ప్రతి ఇంటికి ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. ఎన్నికల సమయంలో అనేక మంది నాయకులు బుడత జంగాల మాదిరి వచ్చి మాయ మాటలు చెప్పి ఓట్లు అడుగుతారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. అటువంటి నాయకులు ఎన్నికలు తరువాత ప్రజలకు కనిపించరని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు, ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమిలీ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, నాయకులు బి. గురునాయుడు, టి.అప్పలనాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

కొద్ది రోజుల్లో భారీగా చేరికలు

భీమునిపట్నం : మరికొద్ది రోజుల్లో వైసీపీలోకి భారీగా చేరికలు ఉంటాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆనందపురం మండలం గొట్టిపల్లి ఎంపీటీసీ సభ్యుడు దొంతల కనకరాజు, తన అనుయాయులతో కలిసి టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసినా, ప్రలోభాలు పెట్టినా కార్యకర్తలు, జనంలో జగన్ బలంగానే వున్నారని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్, భీమిలిలో వైసీపీ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. ఈ కార్యక్ర మంలో ఆనందపురం మండల వైసీపీ అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు మజ్జి వెంకటరావు, బంటుపల్లి మణిశంకరనాయుడు, తాడివాడ అప్పలస్వామి, పిన్నింటి వెంకటరమణ, గంర్రెడ్డి శ్రీనివాసరావు, పద్మనాభం మండల నాయకుడు సుంకరి గిరిబాబు, భీమిలి మండల నాయకులు యలమంచిలి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కాగా ఆనందపురం మండల నాయకులు మాట్లాడుతూ ముగ్గురు వైసీపీ సర్పంచులు టీడీపీలో చేరారని గంటా శ్రీనివాసరావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కణమాం సర్పంచ్ రాము ఒక్కడే తమ పార్టీకి చెందినవారని, మిగిలిన ఇద్దరు టీడీపీ, జనసేన పార్టీలకు చెందినవారన్నారు.

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు



తూర్పు నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

పెదవాల్తేరు/ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. గురువారం రాత్రి ఈస్టుపాయింట్ కాలనీ, కేడీపీఎం స్కూల్ తదితర ప్రాంతంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్-1 మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, నెక్కంటి రాజు, కాంబాపు శివారెడ్డి, చిన్నిపిల్లీ రామిరెడ్డి, నరేంద్ర, నింగిబోతు శ్రీను, ఒలిశెట్టి గురునాథ్, మురళి, బుజ్జి పాల్గొన్నారు. 20వ వార్డులోనూ అయ్యన్న ప్రచారం చేపట్టారు.

22వ వార్డులో టీడీపీ ప్రచారం

మద్దిలపాలెం, ఏప్రిల్ 4 : ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పార్టీ విశాఖ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ కోరారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి 22వ వార్డులో ప్రచారం నిర్వ హించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీని ఓడించి రాష్ట్రాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగు తుందని 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్చుతరావు అన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి ఆబోతుల అప్పలనాయుడు, సీనియర్ నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు, మదుపాడ సన్యాసిరావు పాల్గొన్నారు. అలాగే 12వ వార్డులో జరిగిన కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, పోతిన భరత్, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం అన్నారు. ఈస్ట్‌పాయింట్ కాలనీలో ఆయన తన బృందంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి పోతనరెడ్డి, నరేంద్ర, శివ, శివ, గోపి, శివరెడ్డి, మురళి, కనక, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పొలిమేర ఉత్సవం

భీమునిపట్నం, ఏప్రిల్ 4 : భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ పొలిమేర ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ఐదు గంటలకు లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్ ఆవరణలో వున్న అమ్మవారి సదురుపట్టు నుంచి అమ్మవారి ప్రతిరూపమైన తంగేటి పూలగరగకు ఆలయ పూజారి చౌదరి సత్యరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గౌడవీధి, సుభాష్ రోడ్, మసీద్‌రోడ్, ఉప్పు గల్లీలు, ఎల్లమ్మపేట, కుంచమాంబ, ఎల్లారమ్మ ఆలయాల మీదుగా చిన్నబజారు కర్రోతు రాములు ఇంటికి చేరింది. సాయంత్రం అక్కడి నుంచి బోయవీధి జాలర్ల చెక్క భజన, డప్పు వాయిద్యాలతో సదురుపట్టుకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాసుపల్లి కొండబాబు, పూజారులు చౌదరి వెంకటేష్, భక్తులు శివ, సందీప్, అడిదం కుమార్, కుప్పిలి ఉమ తదితరులు పాల్గొన్నారు.



తంగేటి పూలగరగ ఊరేగింపు

'యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి'

సాగర్‌నగర్, ఏప్రిల్ 4 : రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ పరిశోధనా కేంద్రాన్ని ఆ కళా శాల వైస్ ప్రెసిడెంట్ డి. దక్షిణామూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్‌పై విద్యార్థులు పట్టుసాధించి మంచి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సాంకేతిక పరిశోధనలకు, మౌలిక సదుపాయాలు కల్పనకు తమ కళాశాల అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ సెక్రటరీ ఆచార్య పి. సోమరాజు, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి

సిరిపురం, ఏప్రిల్ 4 : టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సుజన అన్నారు. గురువారం ఆమె 28వ వార్డు పెకర్ లే అవుట్‌తోపాటు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. వెలగపూడిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క కనకరాజు, పైడిరాజు, సన్యాసినాయుడు, పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమ, అఖిల పాల్గొన్నారు.

వారపు సంతతో ట్రాఫిక్ ఇబ్బందులు



పద్మనాభంలో రోడ్డుపై నిర్వహిస్తున్న వారపు సంత

పద్మనాభం, ఏప్రిల్ 4 : పద్మనాభంలోని ప్రధాన రహదారిపై ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వారపు సంత వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సంతలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నిత్యావసర వస్తువులు, చేపలు, మాంసం, దుస్తులు తదితర వస్తువులు విక్రయిస్తారు. సంత నిర్వహణ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతోంది. గతంలో సంత నిర్వహించిన స్థలం ఆక్రమణకు గురవ్వడంతో 2006-11 నాటి పంచాయతీ పాలకవర్గం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నాబార్డు సహకారంతో పద్మనాభంలోని కోనేరు గట్టును చదును చేసి అక్కడ షెడ్లు నిర్మించి సంతను తరలించారు. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానులో షెడ్లు కూలిపోయాయి. అయినప్పటికీ అక్కడ మిగిలి ఉన్న అరుగులపై సంత నిర్వహించేవారు. 2020లో సంత నిర్వహించే ప్రదేశంలో రైతు భరోసా కేంద్రం నిర్మించడంతో కొందరు వ్యాపారులు అక్కడ స్థలం చాలక రోడ్డుపై విక్రయాలు చేపడుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. విజయనగరం-పద్మనాభం-శొంఠ్యాం రోడ్డులో వాహనాల రద్దీ అధికం. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.ఈ సంత సుమారు 15 నుంచి 20 గ్రామాల ప్రజలకు ఉపయోగకరం. అధికారులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సంత నిర్వహణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

7న జూపార్కులో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ఆరిలోవ, ఏప్రిల్ 4 : నగరంలోని జూపార్కులో ఈనెల 7న జూ లవర్స్ డే సందర్భంగా విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలకు 3 నుంచి 12 ఏళ్లలోపు చిన్నారులు అర్హులని, జూలో ఉన్న జంతువుల థీమ్‌లో డ్రెస్‌లు ధరించి పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. పూర్తి వివరాలకు 9441130894 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆమె సూచించారు.

17వ వార్డులో ఎంవీవీ ప్రచారం



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఎంపీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 4 : జీవీఎంసీ 17 వార్డులోని ఎంవీపీ కాలనీ ఐదో సెక్టరులో ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక పథకాలు అందించిందని, మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. గత ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపించారని, ఈసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్పొరేటర్ గేదెల లావణ్య పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

సింహాచలం, ఏప్రిల్ 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి పాలక మండలి సభ్యుల పదవీకాలం ఈనెల 6తో రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గత సమావేశాల్లో తీసుకున్న పలు నిర్ణయాలు అమలుకు నోచుకోలేదని, సత్వరమే వాటిని అమలు చేయాలని పాలక మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. గురువారం ఆయన ఈఓ శ్రీనివాసమూర్తిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ సింహగిరిపై తిరునామాలు, స్వాగత ద్వారాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాలయాల్లో అభివృద్ధి పనులు, భైరవస్వామి ఆలయ రోడ్డు నిర్మాణం, నగరంలోని ప్రహ్లాద ప్రార్థనా మందిరం స్వాధీనం పనులను పూర్తి చేయాలని విన్నవించారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 4 : వేసవి నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న చెప్పారు. గురువారం ఆమె పలు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు గొడుగులు, టోపీలు, టవల్ వంటివి ఉపయోగించాలని సూచించారు. ఎక్కువ నీడ ఉన్న ప్రదేశాల్లో మాత్రమే పని చేయాలని, ముఖ్యంగా గర్భిణిలు, బాలింతలు చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మొక్కుబడిగా ఉపాధి కూలి పెంపు

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 4 : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు మొక్కుబడిగా రూ. 27 పెంచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. గతంలో రోజుకి రూ. 273 కూలి ఇచ్చేవారని, దానికి అదనంగా రూ.27 పెంచి రూ. 300 ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెరిగి జీవనం కష్టంగా ఉన్న సమయంలో కూలీలకు కనీసం రోజుకు రూ. 500 చెల్లించాలని,పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పూడికతో ప్రధాన కాలువ



పూడికతో ఉన్న కాలువ

ఆరిలోవ, ఏప్రిల్ 4 : జీవీఎంసీ తొమ్మిదో వార్డు సంజయ్‌గాంధీ కాలనీ ఓపెన్ జిమ్ సమీపంలో ఉన్న ప్రధాన కాలువ పూడికతో నిండిపోయింది. నెలలు తరబడి కాలువలో పూడిక తీయకపోవడంతో ఈపరిస్థితి నెలకొంది. దీంతో జిమ్‌కు వస్తున్న వారు, స్థానికులు కాలువ నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దోమల వ్యాప్తి వల్ల రోగాల బారిన పడుతు న్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలో పూడికలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో ఏయూకు పతకాలు



విజేతలను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 : జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన 37వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు పలు పతకాలు సాధించారు. పంజాబ్‌లోని లూధియానా వ్యవ సాయ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు హాజరయ్యారు. ఈమేరకు చిత్ర కళా విభాగం విద్యార్థి కె. నాగమణికంఠ క్లే మోడలింగ్‌లో మూడవ స్థానం, ఇనస్టలేషన్ పోటీలో జె. రంగబాబు, యుఎంఎస్ నవ్య, బి. ఝాన్సీ కె. రేణుక బృందం రెండవ స్థానం సాధించారు. వారిని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

డాక్టర్ శ్రీకృష్ణకు పురస్కారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 : ఏయూ యోగా విభాగం గౌరవ ఆచార్యులు డాక్టర్ చందన శ్రీకృష్ణకు యోగ చికిత్స ఆచార్య పురస్కారం లభించింది. ఇండియన్ యోగా అసోసియేషన్ డాక్టర్ శ్రీకృష్ణ సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణను వీసీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

సేవకుడే నాయకుడు : ఏయూ రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 : సేవకుడే నాయకుడని, అటువంటి నాయకులను తయారు చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం కావాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూలోని ఎన్ ఎస్ఎస్ సెమినార్ హాల్‌లో రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ పాలసీ, పెరుంబదూర్, ఏయూ జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలోని ప్రోగ్రాం అధికారులకు 'యువజన హక్కులు న్యాయ సహాయం' అన్న అంశంపై మూడు రోజుల శిక్షణను ప్రారంభించారు.

సీనియర్లకు ఘనంగా వీడ్కోలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 : ఏయూ తెలుగు విభాగంలో ఎంఏ మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం వారికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు.ఆ శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నిరాశ నిస్పృహలు వదిలిజీవితాశయంతో ముందుకు సాగితే విజయం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.